కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

- సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- వేగంగా నాడు–నేడు పనులు

పెనుమంట్ర: విద్యావ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన సమూల మార్పుల ద్వారా పల్లెల్లో ప్రభుత్వ బడులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మారాయి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ప్రారంభించిన నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటుతో పాటు, అమ్మ ఒడి, విద్యా దీవెన వంటి పథకాల ద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడమే కాకుండా, విద్యార్థుల్లో స్థానికంగా చదువుకోవాలనే కుతూహలాన్ని రేకెత్తించే వాతావరణం కనిపిస్తోంది. మండలంలో నాడు–నేడులో 51 పాఠశాలలకు గానూ తొలివిడతలో రూ.2.99 కోట్లతో 19 పాఠశాలలను తీర్చిదిద్దగా రెండో విడతలో రూ.8.48 కోట్లతో 31 పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారు.

ఎస్.ఇల్లిందపర్రులో వేగంగా పనులు

రెండో విడత పనుల్లో ఎస్.ఇల్లిందపర్రు యూపీ పాఠశాలను కూడా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం రూ.22 లక్షలతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ గ్రామంలో అధిక శాతం బడుగు బలహీన వర్గాలు వారే. ఈ గ్రామంలో గతంలో ప్రాథమిక స్థాయిలోనే విద్యనభ్యసించి మధ్యలో చదువుకు స్వస్తి చెప్పే వారు. అయితే, నేడు జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో గ్రామం నుంచి పట్టణాలకు వెళ్లి విద్యను అభ్యసించే వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. అంతేగాకుండా నిష్ణాతులైన ఉపాధ్యాయులు పాఠశాలలో ఉండడం, ఇంగ్లిషు విద్యను సైతం అందుబాటులోకి తీసుకు రావడంతో పాఠశాలలో విద్యార్థు సంఖ్య పెరుగుతూ వస్తుంది. గతంలో 100 కంటే తక్కువ ఉన్న విద్యార్థుల సంఖ్య, నేడు 142కు చేరింది. ఎనిమిదో తరగతి వరకూ ఉన్న పాఠశాలలో 8 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేయడంతో వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మండల స్థాయిలో పాఠశాల విద్యార్థి గురుజాపు రేవతి 7756 నిముషాలు, వెలగల రూపాలక్ష్మి 7486 నిముషాలు అత్యధికంగా వినియోగించుకొని ముందంజ వేశారు. సాంకేతికంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందంజ వేస్తుండడంతో తల్లిదండ్రుల్లోనూ ఆనందం వ్యక్తం అవుతుంది.



ఎస్.ఇల్లిందపర్రులో ప్రభుత్వ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల

రూపు రేఖలు మార్చారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ రూపురేఖలు మార్చారు. గ్రామాల్లోనూ కార్పొరేటు స్థాయికి దీటుగా దీర్చిదిద్ది నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. దీంతో బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యనందించడంతో సీఎం జగన్ సఫలీకృతమయ్యారు. విద్యావ్యాప్తికి పాఠశాలలకు అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం జగన్‌కు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు

– కేవీ నారాయణ రెడ్డి(వాసు), ఎంపీపీ

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలకు



ఐదో తరగతి వరకూ ప్రైవేట్ స్కూలులో చదివి, ప్రభుత్వ పాఠశాలలోల చేరాను. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించడంతో పాటు, సాంకేతికంగా ముందంజ వేయడానికి ట్యాబ్‌లు సైతం అందించారు. దీంతో నాన్నకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు, అమ్మకు పనిభారం తగ్గింది.

– వెలగల రూపలక్ష్మి, 8వ తరగతి

నేడు నరసాపురం కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సాధారణ సమావేశం అనంతరం అత్యవసర సమావేశం కూడా జరుగుతుందని వివరించారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు విధిగా హాజరుకావాలని సూచించారు.

సిరిధాన్యాల అంబలితో జీర్ణకోశ వ్యాధుల నిర్మూలన

పాలకొల్లు అర్బన్: సిరి ధాన్యాలతో తయారు చేసిన అంబలి తాగడం వలన జీర్ణ కోశ వ్యాధులు నయమవుతాయని డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం తెలుగుతల్లి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సిరి ధాన్యాలతో తయారు చేసిన అంబలిని పంపిణీ చేశారు. ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ జి.భవానీ ప్రసాద్ మాట్లాడుతూ మజ్జిగ, అంబలి ప్రతీ రోజు ఆహారంగా తీసుకుంటే ప్రమాదకరమైన వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. డాక్టర్ నవ్యజీవన్, తెలుగుతల్లి వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు పి.వెంకటస్వామి, కార్యదర్శి పి.కిషోర్, కోశాధికారి రాజా చరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూ సర్వే పనులు సక్రమంగా చేయాలి



సచివాలయ కార్యదర్శులతో రీసర్వే ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్న కమిషనర్

నరసాపురం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాల నిమిత్తం చేయాల్సిన సర్వే పనులు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ కె. వెంకటేశ్వర్లు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ తన ఛాంబర్‌లో వార్డు సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులు, వివిధశాఖల మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు రీసర్వే ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డును యూనిట్‌గా తీసుకుని సర్వే చేయాల్సి ఉందన్నారు. పట్టణం మొత్తం సమగ్ర సర్వే ప్రాతిపదికపై సర్వే రికార్డులు డిజిటలైజేషన్ ద్వారా అప్డేడ్ చేయడం, ఫీల్డ్ సర్వే, హద్దులు గుర్తించడం లాంటి 8 సర్వే పనులు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



పూజలు చేస్తున్న పురోహితులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించారు. మంగళవారం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శంకరాచార్యుల విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పట్టణ గాయత్రీ స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో పురోహితులందరూ కలిసి శంకరాచార్యుల విగ్రహానికి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అనిల్, వీరబాబు, పూర్ణయ్య, సోమేశ్వరరావు, సంఘ అధ్యక్షులు మద్దూరి సూరిబాబు, సెక్రటరీ కుమార్, ఎం ఫణి, తనికెళ్ల శ్రీనివాస్, ఆర్ సత్యనారాయణ, నుదురుపాటి శ్రీను పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం ప్రదర్శన

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని శంభునిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి 7 గంటలకు అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు నవ చైతన్య అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కోట రత్నరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో 40 మంది కళాకారులతో, లైటింగ్ ఎఫెక్ట్స్‌తో ఈ నాటకం ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆచంట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

పెనుగొండ: జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ ఆచంట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలను ముఖ్యమైన కూడళ్లలో ఏర్పాటు చేయాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు, ఎస్సై ఎం.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

పెనుగొండ: కొడమంచిలిలో మంగళవారం ఓ గడ్డివాము దగ్ధమైంది. గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆవుల కోసం ఏర్పాటు చేసిన సుమారు 20 ఎకరాల గడ్డి ఉండే గడ్డివాము వద్ద ఒక్కసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. పాలకొల్లు నుంచి అగ్నిమాపక యంత్రంతో పాటు, స్థానికుల కృషితో మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పెనుప్రమాదం తప్పింది.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నరసాపురం రూరల్: ధాన్యం కొనుగోలు ముమ్మరం చేయాలని కౌలురైతు సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం నరసాపురం మండలంలోని మల్లవరంలంక, కొప్పర్రు, రుస్తుంబాద, ఎల్బీచర్ల, చిట్టవరం, సీతారాంపురం తదితర ప్రాంతాల్లో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు నేతృత్వంలోని బృందం పర్యటించింది. ధాన్యం కొనుగోళ్ల గురించి రైతుల నుంచి వివరాలు సేకరించారు.

బాలకార్మికులను పనిలోకి తీసుకుంటే చర్యలు

సాక్షి, భీమవరం: దుకాణాలు, ఫ్యాక్టరీలు, సంస్థల్లో బాలకార్మికులను పనిలోనికి అనుమతిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని భీమవరం 2వ సర్కిల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.శివనాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భీమవరం టుటౌన్, ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాల పరిధిలోని దుకాణాలు, ఫ్యాక్టరీల యజమానులు జాగ్రత్త వహించాలని సూచించారు.

జగనన్నే మా భవిష్యత్‌కు విశేష స్పందన



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ వెల్లడించారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీపుల్స్ సర్వే ఫలితాలను చూసి ప్రతిపక్ష పార్టీలు ఉలిక్కి పడుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజుల వ్యవధిలో కోటి కుటుంబాలను సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు సందర్శించారన్నారు. ప్రజల ఇళ్లను నేరుగా సందర్శించి వారితో వ్యక్తిగతంగా మాట్లాడినప్పుడు సీఎం జగన్ చేసిన అభివృద్ధి వారి మాటల్లో వెల్లడైందన్నారు. ప్రతీ నెలా 1వ తేదీన పింఛన్ పొందుతున్న వృద్ధుల మాటల్లోనే ప్రభుత్వంపై వారికున్న నమ్మకం తెలిసిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు బలంగా ఉన్న కొన్ని చోట్ల వారి ఇళ్లకు వెళ్లి ప్రజలకు అందుతున్న లబ్ధిని వివరించడంతో సానుకూల స్పందన లభిస్తోందన్నారు. రాబోయే రోజులోల నూటికి నూరుశాతం ఇళ్లను సందర్శించి సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తామన్నారు. సమావేశంలో ఆక్వా బోర్డు డవలప్‌మెంట్ కమిటీ వైస్ చైర్మన్, పార్టీ పరిశీలకుడు వడ్డె రఘురామ్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన



మొగల్తూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొల్లు అర్బన్: వైద్య సిబ్బంది కృషి వల్లే మలేరియా వ్యాధి నిర్మూలించవచ్చని మెడికల్ ఆఫీసర్ డా.అద్దాల ప్రతాప్‌కుమార్ అన్నారు. మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి అనాఫలిస్ ఆడదోమల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుందని, ముఖ్యంగా మంచినీటిలో ఈ దోమలు పెరుతాయన్నారు. దోమలు పెరిగే ప్రదేశాలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఎం నవ్యజీవన్, డా.జి భవానీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, కె ప్రభాకర్, పీహెచ్ఎన్ ఎలిజబెత్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాలకొల్లు పట్టణంలో

పాలకొల్లు సెంట్రల్: మలేరియాను నివారించుకోగలిగే అవకాశం ఉన్నా అవగాహనా లోపం వల్ల నివారించుకోలేకపోతున్నామని డాక్టర్ జాన్ లియో తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వీవర్స్ కాలనీ, బంగారు వారి చెరువుగట్టున ఉన్న ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొడమంచిలిలో..

పెనుగొండ: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా నిర్మూలనపై కొడమంచిలి పంచాయతీ వద్ద అవగా హనా ర్యాలీ నిర్వహించారు. మలేరియా రాకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ముందస్తు చర్యలు గ్రామంలో తీసుకుంటున్నట్లు ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి హినాభాను, ఎంఎల్‌హెచ్‌పీ రూపాంజని, రాశి, ఏఎన్ఎం పుష్పరాజ్యం పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: పరిశుభ్రతను ప్రతీ ఒక్కరూ పాటిస్తూ, దోమలవ్యాప్తిని అరికడితే మలేరియాను నియంత్రించవచ్చని మండల వైద్యాధికారి దినేష్ సూచించారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గ్రామంలో ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ ఆర్.శ్రీనివాస్, పీహెచ్ఎన్ ఎస్‌జె సత్యవతి పాల్గొన్నారు.

జేబీఎస్ఎస్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి



రిటైర్డ్ ఇన్‌కంటాక్స్ ఇన్‌స్పెక్టర్ టి.మదన్‌మోహన్‌ను సత్కరిస్తున్న జైభీమ్ సేవాసమితి సభ్యులు

పోడూరు: జైభీమ్ సేవాసమితి(జేబీఎస్ఎస్) ద్వారా రానున్న కాలంలో సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృతం చేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైలాబత్తుల రాజశేఖర్, చింతా సంపత్‌లు తెలిపారు. పెనుమదం శివారు అప్పిచెరువులోని కార్యాలయంలో మంగళవారం జేబీఎస్ఎస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, సంపత్‌లు మాట్లాడుతూ పేద విద్యార్థులకు, పేద రోగులకు అండగా నిలవడమే సంస్థ లక్ష్యమన్నారు. సంస్థ సేవా కార్యక్రమాలకు రిటైర్డ్ ఇన్‌కంటాక్స్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్ అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. సమావేశం అనంతరం జేబీఎస్ఎస్ ఆధ్వర్యంలో మదన్‌మోహన్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు రావి కృష్ణమూర్తి, కోశాధికారి గొల్ల జనార్ధనరావు, సభ్యులు ఎం.సురేష్, వి.రమేష్, ఎస్.శ్రీను, వి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో గ్రామ స్వరాజ్య స్థాపన



ఉత్తమ పంచాయతీలుగా అవార్డులు అందుకున్న సర్పంచ్‌లను అభినందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: మహాత్మా గాంధీ కలల గన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ఉత్తమ పంచాయతీలుగా అవార్డులు అందుకున్న పంచాయతీ సర్పంచ్‌లు కుచ్చర్లపాటి మంగతాయారు, బొర్రా రవికుమార్, వెలగల ధర్మారెడ్డి, తాడిపర్తి ప్రియాంక, తమనంపూడి వీర్రెడ్డి, గూడూరి దేవేంద్రుడు, చింతపల్లి గనిరాజు(చంటి)లను తూర్పుపాలెంలో మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లతో పాటు పోడూరు జడ్పీటీసీ గుంటూరు పెద్దిరాజు, ప్రవీణ్, ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, మేడిచర్ల పండులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను కాపాడాలి

గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో పోలీసులు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ గ్రామంలోనూ శాంతి భద్రతలను కాపాడడానికి ప్రభుత్వ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు జీవీవీ నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళన పనుల పరిశీలన

పెనుగొండ: సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రయిన్ ప్రక్షాళన పనులను మంగళవారం మాజీమ ంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరిశీలించారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో సిద్ధాంతం మునకపై ప్రజల విజ్ఞప్తి మేరకు ఇటీవల డ్రెయిన్ ప్రక్షాళన పనులు చేపట్టారు. త్వరగా పూర్తి చేయాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, పార్టీ నాయకులు కుడిపూడి రామకృష్ణ, సుతాపల్లి సత్తిబాబు, కంకిపాటి డేవిడ్, బలువు కేదారేశ్వరుడులు పాల్గొన్నారు.

రంగనాథరాజుకు కృతజ్ఞతలు

పెనుగొండ: గడపగడపకూ మన ప్రభుత్వంలో సమస్యను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకువెళ్లగానే సత్వరం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొన్న ందుకు గాను ములపర్రు చెరువుపేట గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. చెరువుపేటలో విద్యుత్ స్తంభాలు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు మంగళవారం విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు విద్యుత్ శాఖాధికారులు శ్రీకారం చుట్టారు.ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించే మనసున్న మారాజు శ్రీరంగనాథరాజు అంటూ కొనియాడుతూ గ్రామలో ప్రత్యేక ఫ్లేక్సీలు వేయించారు.

వృద్ధ దంపతులకు చేయూత

పోడూరు: పోడూరులో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ దంపతులకు వసుధఫౌండేషన్ చేయూత అందించింది. గ్రామానికి చెందిన శివ నారాయణరాజు కొంతకాలంగా కిడ్నీ వ్యాధితోను, ఆయన భార్య పద్మావతి గుండె, లివర్ సమస్యలతో బాధపడుతున్నారు. వీరి ఇద్దరు కుమారులు కిడ్నీ వ్యాధితో కొంతకాలం కిందట చనిపోయారు. వీరి పరిస్థితి తెలుసుకుని వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు సంస్థ ద్వారా వీరికి సాయం అందించారు. ఫౌండేషన్ కన్వీనర్లు పెన్మెత్స బుద్ధరాజు, రుద్రరాజు సుజాత మంగళవారం వృద్ధ దంపతుల నివాసానికి వెళ్లి ఫౌండేషన్ పంపిణీ చేసిన రూ.10వేల ఆర్థికసాయం అందించారు

మండల పరిషత్ సమావేశం బహిష్కరణ



మండల పరిషత్ సమావేశాన్ని బహిష్కరించిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

పెనుగొండ: ఆచంట ఎంపీపీ ఏకపక్ష దోరణిగా వ్యవహరిస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల పరిషత్ సమావేశాన్ని బహిష్కరించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ మాట్లాడుతూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ రాజ్ అవార్డుల ప్రదానోత్సవంలో ఎంపీపీ సర్పంచ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఎంపీడీఓ కార్యాలయం ప్రజా సమస్యలు పరిష్కరించే వేదిక కావాలి కాని, నిత్యం రాజకీయ వేదికలా మార్చి ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఎంపీటీసీ సభ్యులకు నిధుల కేటాయింపులోనూ పక్షపతా దోరణితో వ్యవహరించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపైన స్థానిక శాసన సభ్యులపైనా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని ఎంపీటీసీ సభ్యులు లు ఉల్లం జ్యోతి, తొప్పెట్ల విజయకుమారి, యల్లమెల్లి బేబీ, ఏడద రామలక్ష్మీలు హెచ్చరించారు. సర్పంచ్‌లు కోట సరోజనీ , జక్కంశెట్టి చంటిలు సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలు తీర్మానాలను ఎంపీపీ ఆధ్వర్యంలో ఆమోదించారు.

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ప్రాధాన్యం



జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్‌తో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు యువజన విభాగంలో ప్రాధాన్యత కల్పించాలని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కమిటీల నియామకం విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా, పట్టణ, మండల యూత్ కమిటీల నియామకం విషయాన్ని శ్రీనివాస్‌తో చర్చించిన సందర్భంగా సూచనలు చేశారు.

వడ్డిపోలమాంబను దర్శించుకున్న శ్రీనివాస్.

పట్టణంలోని రెల్లివీధిలో వేంచేసియున్న వడ్డిపోలమాంబ, కుంచమాంబ అమ్మవార్లను జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ దర్శించుకున్నారు. పుష్కరానికి ఒకసారి నిర్వహించే అమ్మవార్ల జాతరకు ఎంతో విశిష్టత ఉంటుందని ఉత్సవ కమిటీ చైర్మన్ ధనాల శ్రీనివాస్ వివరించారు. అమ్మవార్లను దర్శించుకున్నవారిలో రాష్ట్ర ఆక్వా డవలప్‌మెంట్ బోర్డు వైస్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు వడ్డె రఘురామ్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, గాదె వెంకన్న, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు తదితరులున్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం



కొడమంచిలిలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



పోడూరులో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణరాజు

పెనుగొండ: అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందించిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఆచంట మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. మంగళవారం కొడమంచిలిలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి వెళ్లి ప్రభుత్వ పనితీరును ప్రజల వద్ద అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, దేవస్థానం అధ్యక్షుడు బాలనాగు నరేష్, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, గ్రామ అధ్యక్షుడు సాక సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బొరుసు రాంబాబు, కొండేటి రమేష్, గున్నా బత్తుల వెంకటాచారి, పోలిశెట్టి వనమరాజు, రొక్కాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు అన్నారు. పోడూరు గ్రామంలో మంగళవారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సువర్ణరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనతో మహిళలు, రైతులు, కార్మికులు, చేతివృత్తిదారులు, అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన పై, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలను ఆరా తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చేకూరి సూరిబాబు, ఏఎంసీ డైరెక్టర్ గంటా గిరిబాబు, పాలా ఏడుకొండలు, దొంగ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.